# ఒక రాత్రి

శ్రీ చేబోలు
వెంకట్రావు

వర్ష పుజల్లు పడుతూంది. ఆకాశమంతా మేఘావృత మయివుంది. అడపాదడపా మెరుపులకాంతికి తప్పించి ఒకరి ముఖము ఒకరికి కన్పించటం లేదు. నిశిథరాత్రి అవటంచేత్త ప్రపంచకానికి చాల భీకరముగా ఉంది.

కాని అక్కడ చూడండి–గదిలో మాత్రము వెచ్చగా ఉంది. కిటికీలన్ని మూయబడి ఉన్నాయి. వాటికి కట్టబడియున్న ముఖమల్ పర్దా గుడ్డలు మాత్రము ఎగురుతూ ఉన్నాయి. బయట ఉరుముల కఠోర శబ్దము గ్రామఫోను యొక్క,

రాజా జానీ నా మాగో మదవనకే...
తీరకే! తీరకే!! తీరకే!!!......

హిందీ రాగ శబ్దములో లీనమయిపోతుంది. గదిలో వ్రేలాడుచన్న దీపపు కాంతిచేత అర్ధనగ్న చిత్రములు తమ అంగసౌందర్యమును వెలిజిమ్మి శరీరము పులకరింప జేస్తున్నాయి.

గదిమధ్య, ముఖమల్ గుడ్డ పరువబడిన ఒక టేబిల్, అందుమీద పన్నీరుబుడ్లు, గ్లాసులు గోల్డ్ ఫ్లేక సిగరెట్లటిన్ చుట్టూ నాలుగు, ఐదు సోఫాలు అందముగా అమర్చబడి ఉన్నాయి. బీరువాలోని సెంటులవల్ల గది అంతా సుగంధమయమయివుంది.

గదికి రెండు వైపుల మెత్తని పరుపులతో అమర్చబడ్డ మడత మంచములు ఉన్నాయి. ఒక మంచము మీద, నవయవనవతి. మోహనాంగి, "కళావతి" కాళ్లు పారచాచికొని వెల్లకితలా పండుకొని నిద్రిస్తూంది. రెండవ మంచము మీద 'సుధీర్' కునుకుతూ పరుండి ఉన్నాడు.

రికార్డు నడుస్తూనే ఉంది:—
రాజా జానీ ఉ ఊ...!
రాజా జానీ ఉ ఊ...!

సుధీర్‌కు నిద్ర పట్టడంలేదు. లేచి నుంచుని చూచుసరికి 'కళ' మాత్రము గాఢ నిద్రలో ఉంది.

'ఆహా! ఎంత సుందర వనితా?' హృదయావేదన వల్ల శరీరం కంపించింది. ఆశబ్దము చెవులలో ప్రతిధ్వనించింది.

ఆ బంగారు చాయ, యవ్వనకాంతుల వెదజల్లు నేత్రములు, ఎత్తై, విచ్చలవిడిగా పెరిగిన గుబ్బలు...ఆహా?

అతని శరీరం ప్రేమాతిశయంవల్ల కంపమెత్తింది. ఓహో! ఏమి సుదినము? కళ. ప్రేమైకరాసి చిరవాంఛితమైన కళ—నాయింటికి వచ్చి, విశేషించి అర్ధరాత్రి నాగదిలోనే సుఖనిద్ర పొందుతుంది. ఇది ప్రపంచకమునకు భయానకమైన రాత్రి అయినప్పటికి నాకు ప్రియదర్శనమువల్ల సుఖదాయకమే. ఆమెతో సంగమమునకు సుధీర్ చాల తత్తరపడి పోతున్నాడు. కాని ఒక్కటి శంక:

రేవు ప్రొద్దున ప్రజలందరు సుధీర్–కళను చెరిచాడు–అని అనకుండా ఉంటారా? మరి...మరి...కళావతి తండ్రి డాక్టర్ మహేంద్రుడు విన్నప్పుడు ఊరుకుంటాడా? నాతండ్రిగాని, తల్లిగాని ఏమంటారు! ఊరిలో స్నేహితులో? బజారునుంచి వెలువడి రావడం దుస్సహమయిపోతుంది...అప్పుడు...? ఇలాగ ఒకొక్క దృశ్యము అతనియెదుట కనబడుతున్నాయి. ఖిన్నుడయి పోయినాడు. మెల్లగాపోయి కిటికీ పర్దాగుడ్డ తొలిగించి బయట చూచాడు. నీటి తుంపర పడుతునే ఉంది—ఎవరో ఏడుస్తున్నట్టు—రికార్డుకూడ అయిపోయి వట్టి మిషను సంగీత రహితమైన శుష్కశబ్దము చేస్తూంది—సుధీర్ నిరాశ హృదయములాగ.

*

మరల సోఫాచేరి దగ్గిరనున్న పన్నీరు గ్లాసుడు పుచ్చుకున్నాడు. శరీరములో నవశక్తి ఉదయించింది. లేచి రెండవ రికార్డుపెట్టి కళావతి మంచము దగ్గరగా అడుగులు తడబడుతూ సమీపించాడు.

ఆమె ముఖలావణ్యము, తదేక దృష్టితో చూస్తూ తన్మయమయిపోయివాడు. బయట చల్లనిగాలి జోరుగా వీస్తుంది. గాలికి ఆమె పవిట తొలిగిపోయింది. సుధీర్ మనస్సు చలించిపోయింది.

కంపిత స్వరంతో,

"కళా! ప్రియా!! కళా!!!" అని పిలిచాడు, కాని జవాబులేదు. ఆమె నిద్రపోతుంది.

ఆమె తలలోని గులాబీ పువ్వులను మెల్లదిగా పట్టి "హృదయేశ్వరీ? కళా!" అని మరల పిల్చాడు ఇంతలో గ్రామఫోనునుండి ఈ శబ్దము వెలువడింది.

"బాబా, మన్ కి ఆంఖేం ఖోల్"

సుధీర్ వెనుతిరిగి 'ఏమిటీ! నాకే చెపుతున్నావా?' అని తన మంచము మీదకు వచ్చి నడుమువాల్చి వినటం మొదలుపెట్టాడు.

"బాబా మన్ కి ఆంఖేం ఖోల్"

★

నిద్రపోయే దానికి చాల ప్రయత్నించాడు. కాని వృధా. మరల లేచి రెండు గ్లాసుల పన్నీరు త్రాగి గోల్డ్ ఫ్లేక్ సిగిరెట్ వెలిగించాడు. నూతనశక్తి ఉత్పన్నమయింది. కళ మంచము సమీపించి

"ప్రియా!"

"......"

"సుందరీ!!"

"......"

ఆమె నిద్రపోతుంది.

'ఓహో! ఏమి నిద్ర? జీవితములో మరెప్పుడు నిద్ర పోనట్టుంది?'

'కళ కాస్త కదిలి ప్రక్కకు ఒత్తిగిలి పండుకొంది.'

'వింటున్నావా?' అని బుగ్గపట్టుకొని తన వయిపుకు త్రిప్పుకొన్నాడు.

'ఊ......ఊహ!'

'అబ్బా! యెంత మధురముగా నున్నది.' 'ఊ...ఊహ' అతని హృదయం స్వర్గసుఖంలో మునిగిపోయింది. ఆమెవి పల్చని బట్టలవటంచేత శరీరకాంతి బయటకు విరజిమ్ముతుంది. జుట్టు ఉంగరాలు తిరిగి స్వేచ్ఛగా మీద గాలికి కదులుతుంది. ఆమె చెక్కిళ్లలో సుధీర్ ముఖము ప్రతిబింబిస్తూన్నది.

ఆమె నిద్రపోతుంది.........

.........

సుధీర్ చెయ్యి వొణుకుతూ ఆమె వక్షస్థలమును తాకాడు. అతని హృదయము శకటవేగంతో పోతుంది.

కళ ఉలిక్కిపడి లేచి కూర్చుంది. సుధీరుడు భయముతో వ్యాకులుడై శూన్య దృష్టితో గ్రామఫోనువంక చూస్తూ నిలబడ్డాడు. సానుభూతికి ఒక్కమాటైన నోటినుండి వెలువడలేదు.

కళావతి, పవిట సర్దుకొని, కుచ్చెళ్ళు సరిచేసుకొని, జుట్టు దిద్దుకొని, మంచమునుండి దిగిపోయింది. ఆమె నేత్రాలు క్రోధావేశముచేత ఎఱ్ఱబడ్డాయి. ఒళ్లు కంపిస్తూంది. కాని నోట మాటలేదు.

సుధీర్ మనస్సు క్రుంగిపోయింది. కళ మెట్లు దిగిపోవటానికి తయారయింది. సుధీర్ అడ్డు తగిలాడు. ఆమె కోపముతో 'నీ కిదేంపని సుధీర్? నన్ను వెళ్లనీ?'

'ఎక్కడికి? ఇది భయంకర అర్ధరాత్రి! కళా!'

'పోనీ నాకు తోచిన చోటికి పోతాను' అని అంటూండంగానే అడ్డు తగిలి,

'ఇంత నిర్దయ తగదు. కళా! నా తప్పు క్షమించు. నేను నీవాడను' అని ప్రాధేయపడ్డాడు.

✶

మిస్ దుల్సి రికార్డు అతి ప్రేమైకస్వరంతో పాడుతుంది.

సయ్యా లేరీ గోదు మేం
గోందా బనజా ఊంగీ

'సుధీర్ నీవు చాల దుష్టుడవు' అని చిరునవ్వుతో అంది.

'నేను దుష్టుడనే కాని నన్ను యీ స్థితికి తెచ్చినవారు ఇంకను......'

అతని మాటలు వినిపించుకోనట్లు 'కళా చూడు—ఆ దిగంబర చిత్రాలు ఎంత అందంగా ఉన్నాయి. నీకు మోహము పుట్టించటం లేదా?'

'అయితే సరే?' సుధీర్ దీపం ఆర్పాడు. గది అంధకారమయింది.

ఇద్దరు హృదయాలుకూడ చీకటితో మునిగిపోయినాయి.

'అరే, అరే ఇదేంపని?'

'ఏమిలేదు. ఇప్పుడు నాకు దిగంబరదృశ్యాన్ని చూపజాలవు. ఇపుడూ......అయితే......?'

'అలా జరుగు......అరే'! అరే!! చేతి మణికట్టు పట్టుకు ఎందుకు అల్లా విరిచేస్తావు.

ఆ! ఆ!!.........?

'అబ్బబ్బా.........ఉండుండు. కొంచెము'.

'ఊహూ! చూడు, చూడు, మెట్లమీద ఏదో చప్పుడు అవుతుంది!'

'ఊరుకో! ప్రాణేశ్వరీ!! ఊరుకో!!! నీ అందానికి ప్రేమను చేర్చి ఆనంద ప్రవాహంగా మార్చి ప్రియ సమాగమంచేత ధన్యతపొందు! విను. మిస్ దుల్ సీ రికార్డు—

సయ్యా, తేరీ గోదు మే
గోందా బనజా నేంగీ

సుధీర్ రెండు చేతులతో కళనుపట్టి గాఢముగా హృదయమునకు హత్తుకున్నాడు.

ఆ భాగ్యవతిచేత చిరవాంఛితమైన ఉద్దేశ్యం నెరవేరింది.

ఎంత సుఖప్రదము, ప్రియము, మధురము, వాంఛనీయము, ఈ ఆలింగనము!

సుధీర్ ఇప్పుడు ఒక్కనిమిషమైన విడిచి ఉండలేకుండా ఉన్నాడు. కళా సుధీరులు కలసి మెలసి ఉంటున్నారు.

ఆ సమయములో.........

అధికానందంచేత సుధీర్ కళ్లు విప్పేడు.చూస్తే సులక మంచంమీద ఉన్న దూది తలగడా గుండెలకు అదిమిపెట్టి ఉంది.


## చేతిపనులవర్తకరహస్యబోధిని

సబ్బులు, సెంటులు, పరిమళతైలములు, బాణసంచ, అత్తరు, పన్నీరు, పిప్పరమెంటు, మందులు మొదలగునవి సులభముగా తయారుచేయు పరిశ్రమలు 500 గలవు. ధర 1. రూపాయి. పోస్టుఖర్చులు 5 అణాలు.

కొక్కోకము

స్త్రీపురుష రహస్యములు 64 చిత్రపటములతో 302 పేజీలుగల పెద్దపుస్తకము.ధర రు 1-0-0.పోస్టు. ఖర్చు రు. 0-5-0 లు. ఇందులో స్త్రీ పురుష శృంగార రహస్యములు, శయ్యాగృహ మర్మములు గలవు.

దాంపత్య మర్మములు.

పడకటి ముచ్చటలు, రతి సంబంధమయిన అనేక మర్మవిషయము లిందు గలవు. 9 పటములలో 102 పేజీలుగల పెద్దపుస్తకము. ధర రు. 0-8-0. పోస్టు ఖర్చులు 0-5-0. కొక్కోకము, దాంపత్యమర్మములు ఒకేదపా కొండుకొనిన పోస్టుఖర్చులతో రు.1-12-0.

మహారాజ పుస్తకశాల,
అరుణాచలమొదలివీధి, 18 బీటు, మద్రాసు.



## డిజైనులు
## సినిమాస్లైడులు
## హాఫ్‌టోను, లైనుబ్లాకులు
## రబ్బరు ముద్రలు

వలయువారు కేటలాగుకు వ్రాయుడు.

అన్ని చోట్లలోను ఏజంట్లుకావలయును:

## రవిప్రాసెస్

248 తపాలాపెట్టి : : మద్రాసు.